## క్లుప్తంగా

### ఘనంగా వినాయక నిమజ్జనం

ఏలేశ్వరం: వినాయక చవితి ఉత్సవాల ముగింపులో భాగంగా గణపతి విగ్రహాలను సోమవారం రాత్రి ఘనంగా నిమజ్జనం చేశారు. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో స్థానిక దిబ్బలపాలెంలోని సాయినగర్, ఎఎంజీ సమీపంలో నెలకొల్పిన వినాయకుని విగ్రహాలను ఊరేగించి, స్థానిక తిమ్మరాజుచెరువులో నిమజ్జనం చేశారు.

### ఎంపీపీకి సన్మానం



ఎంపీపీ గొల్లపల్లి బుజ్జికి శాలువా కప్పి స్వీట్లు అందజేస్తున్న ఎంపీడీఓ, సిబ్బంది

ఏలేశ్వరం: మండల పరిషత్ అధ్యక్షుడిగా పదవి చేపట్టి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా పట్టణంలో మంగళవారం ఎంపీపీ గొల్లపల్లి బుజ్జిని ఘనంగా సన్మానించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ జె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బందికి ఎంపీపీకి శాలువ కప్పి మోమెంటోలు, స్వీట్లు బహుకరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రజల సహకారంలో మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించామన్నారు. సిబ్బంది పాల్గొన్నారు.

### క్రీడలతో మానసికోల్లాసం

శంఖవరం: విద్యార్థులకు చదువుతో పాటు ఆటలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. కత్తిపూడి జెడ్పీ హైస్కూల్లో ప్రత్తిపాడు నియోజకవర్గ స్థాయి అండర్-14, 17 ఆటల పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ పోటీలు రెండు రోజుల పాటు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పీడీ వెంకట్రాజు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

### గుమ్మళ్లదొడ్డిలో అస్సాగో యాజమాన్యం సమావేశం

గోకవరం: గుమ్మళ్లదొడ్డిలోని అస్సాగో ఇథనాల్ ఫ్యాక్టరీ యాజమాన్యం మంగళవారం సమావేశం నిర్వహించారు. గుమ్మళ్లదొడ్డి రామాలయం వద్ద కార్యదర్శి రమణకుమారి ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, నాయకులతో సమావేశమయ్యారు. ఫ్యాక్టరీ నుంచి దుర్వాసన వెదజల్లుతుందని పలువురు గ్రామస్తులు ఆదివారం రాత్రి ఫ్యాక్టరీ వద్ద ఆందోళన నిర్వహించగా ఫ్యాక్టరీ కార్యకలాపాలను నిలిపివేశారు. ఈ క్రమంలో గ్రామపెద్దలతో కంపెనీ ప్రతినిధులు సమావేశం నిర్వహించారు. విషయం తెలుసుకున్న స్థానిక యువకులు భారీ ఎత్తున అక్కడకు చేరుకుని ఆందోళన చేయడంతో సమావేశం మధ్యలోనే నిలిచిపోయింది.

### పౌష్టికాహార ప్రాధాన్యంపై అవగాహన

తుని: పట్టణంలో మెప్మా ఆధ్వర్యంలో మంగళవారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. అనంతరం పోషకాలతో కూడిన వంటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్లు కుశమంచి శోభారాణి, ఇనుగంటి సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ వెంకటరావు, ఐసీడీఎస్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

### పెద్దిపాలెంలో ప్రజా వేదిక

ప్రత్తిపాడు రూరల్: పెద్దిపాలెంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు అయిన సందర్భంగా ప్రజా వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూర్యప్రభ ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట నియోజకవర్గ ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు, తహసీల్దార్ సూర్యప్రభ, ఎంపీడీఓ కుమార్‌బాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

### సంక్షేమమే కూటమి లక్ష్యం

కిర్లంపూడి: ప్రజల సంక్షేమమే కూటమి ప్రధాన లక్ష్యమని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. బూరుగుపూడిలోని పంచాయతీ కార్యాలయంలో ఎంపీపీ తోట రవి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తోట గాంధీ, జనసేన జగ్గంపేట కో ఆర్డినేటర్ తుమ్మలపల్లి రమేష్ పాల్గొన్నారు.

### ఇంటింటా పర్యటన

తుని: సూపర్ సిక్స్ పథకాల అమలుకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. స్థానిక ఉప్పరగూడెం, రామకృష్ణ కాలనీల్లో మంగళవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. స్థానిక టీడీపీ నాయకులతో కలిసి ఇంటింటా పర్యటించారు. అనంతరం రక్షిత మంచినీటి పథకాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూటమి ప్రతినిధులు యనమల రాజేష్, కుశమంచి శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజుపై ఫిర్యాదు

గోకవరం: పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరుపాడులో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫొటో ఉన్న ఫ్లెక్సీని ఉద్దేశపూర్వకంగా చింపిన ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజుపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ పలువురు దళిత నాయకులు గోకవరం పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు అంబేడ్కర్ చిత్రపటం ఉన్న ఫ్లెక్సీని ఉద్దేశపూర్వకంగా చింపివేశారని, తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయవాది గుల్లా ఏడుకొండలు, ప్రసాద్, అబ్రహం, శ్రీను, బూలా అబ్బులు తదితరులు పాల్గొన్నారు.

# వరుస తుపానులు.. గుండెల్లో గుబులు

- ఆందోళనలో అన్నదాతలు
- ముంపులో ఉండి కుళ్లిన పంటలు
- నష్ట పరిహారం అంచనాల్లో అధికార యంత్రాంగం
- నెలాఖరుకు పొంచి ఉన్న వాయుగుండం



వరదలకు ముంపునకు గురైన వరి పంటను చూపుతున్న రైతు

తొండంగి: వరుస తుపానులు అన్నదాతల కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలు రైతులను నిలువునా ముంచేశాయి. పంటలు ముంపు బారిన పడి కుళ్లిపోవడంతో రైతన్నల గుండె చెరువైంది. తొలకరి నుంచి వరినారు పోసి నాట్లు వేసి కంటికి రెప్పలా చూసుకున్న పంట వరదలకు ముంపుబారిన పడి పూర్తిగా నాశనమైంది. సర్వం కోల్పోయిన అన్నదాతలు ఏం చేయాలో తెలియక గగ్గోలు పెడుతున్నారు. కాగా వరదల కారణంగా నష్టపోయిన పంట వివరాలను అధికారులు అంచనా వేస్తున్నారు. పాక్షికంగా ముంపు బారిన పడిన పంట తెగుళ్ల బారిన పడకుండా రక్షించుకునేందుకు రైతులు పురుగుల మందులు పిచికారీ చేస్తున్నారు. ఇంతలోనే ఈనెలాఖారుకు బంగాళాఖాతంలో మరో వాయుగుండం ఏర్పడి తుపానుగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో అన్నదాతలో మళ్లీ ఆందోళన మొదలైంది.

**2062 హెక్టార్ల పంటకు నష్టం**

తుని సబ్ డివిజన్ పరిధిలో తుని, తొండంగి, కోటనందూరు, రౌతులపూడి, శంఖవరం మండలాల్లో 15వేల హెక్టార్లలో ఖరీఫ్‌లో వరిసాగు జరిగింది. వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి వరదలు రావడంతో సబ్‌డివిజన్ పరిధిలో 2,062 హెక్టార్ల పంట నీట మునగడంతో 2314 మంది రైతులు నష్టపోయినట్టు అధికారులు గుర్తించారు. తొండంగి 1,555 హెక్టార్లలో నీట మునగడంతో 1,485 మంది రైతులు నష్టపోయినట్టు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. ముఖ్యంగా తుని సబ్ డివిజన్ పరిధిలో తుని మండలంలో 311 హెక్టార్లు, కోటనందూరులో 94.6 హెక్టార్లు, రౌతులపూడిలో 65.38 హెక్టార్లు, శంఖవరంలో 36.5 హెక్టార్లలో పంట నీటమునిగింది. తొండంగి మండలంలోనే అధిక విస్తీర్ణంలో పంట ముంపునకు గురవడంతో రైతులు భారీగా నష్టపోయారు. పీబీసీ ఆయకట్టు పరిధిలో కోదాడ, కొమ్మనాపల్లి, సీతారాంపురం, ఎ.వి.నగరం, రావికంపాడు ప్రాంతాలతోపాటు పంపా ఆయకట్టు పరిధిలో పి.అగ్రహారం, పైడికొండ, కృష్ణాపురం, జి.ముసలయ్యపేట ప్రాంతాల్లో వరి పొలాలు ముంపునకు గురయ్యాయి. వరదనీరంతా సముద్రంలోకి వెళ్లకుండా ఈప్రాంతంలోనే నిల్వ ఉండిపోవడంతో రోజుల తరబడి పంట వరదనీటిలో ఉండడంతో పంట పూర్తిగా కుళ్లిపోయింది. దీంతో వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి తీవ్రంగా నష్టపోయామని బాధిత రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

**పొంచి ఉన్న తుపాను ముప్పు**

ఇప్పటికే నాలుగు దఫాలుగా అల్పపీడనాలు, వాయుగుండాల ప్రభావంతో అధిక వర్షాలకు అతలాకుతలమైన రైతన్నల గుండెల్లో ఈనెలాఖరున వచ్చే తుపాను ముప్పు గుబులు పుట్టిస్తోంది. ప్రస్తుతం మెట్ట ప్రాంతాల చేలన్నీ పొట్ట దశలో ఉన్నారు. పల్లపు ప్రాంతాల్లో పాక్షికంగా మునిగిన చేలన్నీ తెగుళ్లబారి నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాయి. ఈ తరుణంలో మరో మారు తుపాను ముప్పు పొంచి ఉందని రైతులంతా ఆందోళన చెందుతున్నారు. కాగా మంగళవారం కూడా మండలంలోని కుండపోత వర్షం కురిసింది. దీంతో పల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. మరి కొద్ది రోజుల పాటు ఇదే పరిస్థితి ఉండనున్నట్టు ఇప్పటికే వాతావరణశాఖ హెచ్చరించింది.



తొండంగి మండలం పైడికొండలో ముంపునకు గురై కుళ్లిపోయిన పంటను పరిశీలిస్తున్న ఏఓ నరసింహం



కొత్తపల్లి ఆవలో వరదల కారణంగా ముంపునకు గురై కుళ్లిపోయిన వరిదుబ్బును చూపుతున్న కౌలు రైతు

**పంట నష్టం ఉన్నతాధికారులకు నివేదించాం**



మండలంలోని అధిక వర్షాలకు అధికంగా నష్టం జరిగింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో సిబ్బంది ఎన్యూమరేషన్ పూర్తి చేసి నివేదికను తయారు చేశారు. పంట నష్టాన్ని అంచనా వేశాం. 1555 హెక్టార్లలో పంట నష్టం జరిగింది. ఈ నివేదిక ఉన్నతాధికారులకు నివేదించాం.

–ఎస్.నరసింహం, మండల వ్యవసాయశాఖాధికారి, తొండంగి

**పంట కుళ్లిపోయింది**



నేను రెండున్నర ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని వరిసాగు చేశాను. వరదలకు పంట మొత్తం మునిగిపోయింది. రోజుల తరబడి ముంపులోనే ఉండిపోయింది. ముంపు తొలగిన తర్వాత చూస్తే పంట మొత్తం కుళ్లిపోయింది. అప్పులు చేసి పొలానికి దాదాపు రూ.70 వేల వరకూ పెట్టుబడి పెట్టా. అంతా నష్టపోయా. ప్రభుత్వం వెంటనే పంట నష్టపరిహారం అందించాలి.

–ముత్తింటి ఏసురాజు, కౌలు రైతు, ఎ.కొత్తపల్లి

## ఉపాధి పనుల్లో రూ.3.86 లక్షల అవకతవకలు



ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

గోకవరం: మండలంలో జరిగిన ఉపాధి హామీ పథకం పనుల్లో సుమారు రూ.3.86 లక్షలు అవకతవకలు జరిగినట్టు అధికారులు గుర్తించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం జరిగింది. తూర్పుగోదావరి జిల్లా అడిషల్ డ్వామా పీడీ బి.రాంప్రసాద్ ప్రిసైడింగ్ అధికారిగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో పంచాయతీల వారీగా గతేడాది ఏప్రిల్ ఒకటి నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు జరిగిన అన్ని రకాల పనులపై ఆడిట్ నిర్వహించారు. దీనిలో భాగంగా వివిధ గ్రామాల్లో మస్తర్ల కొట్టివేతలు, దిద్దుబాట్లులో రూ.14,500, కొలతల్లో వ్యత్యాసాలు రూ.28,600, మొక్కల పెంపకం తదితర వాటిలో రూ.62,450, బినామీ మస్తర్లు రూ.58,320, మినీ గోకులాల్లో రూ.64,450, పంచాయతీ రాజ్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రభుత్వ భవనాలు, సీసీ రోడ్లులో రూ.1,58,225 అవకతవకలు జరిగినట్టు ఎస్ఆర్పీ తులసీనాయక్ వివరించారు. వీటిని సంబంధిత సిబ్బంది నుంచి రికవరీతో పాటు వారిపై చర్యలకు అడిషనల్ డ్వామా పీడీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ, అంబుడ్స్‌మెన్ ఎస్.ఖాదర్‌భాష, ఏపీఓ అప్పలరాజు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

## 28న 'మన ఇల్లు–మన గౌరవం'



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ప్రత్తిపాడు: మండలంలోని పేదల ఇళ్ల నిర్మాణం కోసం కేటాయించిన లే అవుట్‌లలో ఈనెల 28వ తేదీన 'మన ఇల్లు–మన గౌరవం' కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్, మండల ప్రత్యేకాధికారి ఎ.శ్రీనివాసరావు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం లే అవుట్ల ప్రత్యేకాధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ధర్మవరం, ఒమ్మంగి, రాచపల్లి గ్రామాల్లో నాలుగేసి, శరభవరంలో మూడు, ప్రత్తిపాడు, పోతులూరు, వాకపల్లి గ్రామాల్లో ఒక్కొక్కటి వంతున ఏడు గ్రామాల్లో 18లే అవుట్లు ఉన్నాయన్నారు. ఈ లేఅవుట్‌లలో 993 మంది, సొంత స్థలాలు ఉన్న 721 మంది వెరసి 1,714 మంది లబ్ధిదారులకు గానూ 1,092 మంది కాలనీ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్నారని చెప్పారు. మిగిలిన 622 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఈ ఇళ్ల నిర్మాణాలు 2025 మార్చి నెలాఖరుకు పూర్తి చేసేలా ప్రత్యేకాధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్, మండల ప్రత్యేకాధికారి ఎ.శ్రీనివాసరావు ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు, ఇన్‌చార్జి హౌసింగ్ ఏఈ గోవింద్, ఈఓఆర్డీ కేవీవీఎస్ కాశీ విశ్వనాధం పాల్గొన్నారు.

### భారీ వర్షం



గోపాలపట్నంలో కుండపోతగా కురుస్తున్న వర్షం

ఏలేశ్వరం: మండల వ్యాప్తంగా మంగళవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రంగా ఉండగా మధ్యాహ్నం ఒక్కసారిగా మేఘావృతమై వర్షం పడింది. సుమారు గంట పాటు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. గత వారంరోజులు ఎండలు, ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు వర్షంతో ఉపశమనం పొందారు. కాగా రహదారులపై నీరు నిల్వ ఉండడంతో రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు.

తొండంగి: మండలంలో సుమారు రెండు గంటల పాటు ఏకదాటిగా కుండపోత వర్షం కురిసింది.

ప్రత్తిపాడు రూరల్: మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది.

### పిడుగుపాటుకు కొబ్బరి చెట్టుకు మంటలు

గండేపల్లి: తాళ్లూరులో మంగళవారం మధ్యాహ్నం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులు రావడంతో గ్రామస్తులు భయభ్రాంతులకు లోనయ్యారు. అదే సమయంలో గ్రామానికి చెందిన పాలచర్ల సత్యనారాయణ పశువులశాలలో ఉన్న కొబ్బరిచెట్టుపై పిడుగు పడి మంటలు వ్యాపించాయి. ఇంతలో హోరున భారీ వర్షం పడడంతో మంటలు తగ్గుముఖం పట్టి పొగ కమ్మేసింది. దీంతో ఎటువంటి ప్రమాదం చోటు చేసుకోకపోవడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.

### గూగుల్ డెవలపర్ గ్రూపు ప్రారంభం

గండేపల్లి: విద్యార్థుల నైపుణ్యానికి గూగుల్ డెవలపర్ గ్రూప్ దోహదపడుతుందని ఆదిత్య యూనివర్సిటీ ప్రిన్సిపాల్ ఎ.రమేష్ పేర్కొన్నారు. సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో మంగళవారం గూగుల్ డెవలపర్ గ్రూప్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ రమేష్ మాట్లాడుగూ ప్రస్తుత తరానికి సాంకేతిక అంశాలు నేర్చుకునేందుకు ఈ గ్రూపు ఉపయోగపడుతుందన్నారు. సాఫ్ట్‌వేర్ సంస్థ ప్రతినిధి నరసింహ ప్రేమ్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో సేవాగుణం పెంపొందించడమే లక్ష్యం



ఏలేశ్వరం డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ సునీత

ఏలేశ్వరం: విద్యార్థుల్లో సేవాగుణం పెంపొందించడమే ఎన్ఎస్ఎస్ లక్ష్యమని ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డి.సునీత అన్నారు. ఎన్ఎస్ఎస్ పీఓ ప్రగడ ప్రయాగమూర్తి ఆధ్వర్యంలో కళాశాలలో మంగళవారం జాతీయ సేవా పథకం దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సేవా దృక్పథం పెంచడమే ఎన్ఎస్ఎస్ ప్రధాన ఉద్దేశమన్నారు. విద్యార్థుల సేవా గుణం అలవరుచుకోవాలన్నారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సేవలు ప్రశంసనీయమన్నారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ చెన్నారావు, అధ్యాపకులు వెంకటేశ్వరావు, రామారావు, సురేష్, వీరభద్రరావు, మదీనా, శ్రీలక్ష్మీ, పుష్ప, మేరీ రోజిలిన విద్యార్థులు పాల్గొన్నారు.

తొండంగి: పెరుమాళ్లపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ డేను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీ మెహర్ మాట్లాడుతూ విద్యార్థ దశ నుంచి పచ్చదనం, పరిసరాల పరిశుభ్రత వంటి కార్యక్రమాల ద్వారా సామాజిక సేవ చేయాలన్నారు. వైస్.ప్రిన్సిపాల్ పి. దివాకర్‌రావు; అధ్యాపకులు పి.వి.కృష్ణారావు, ఎస్.ఎస్.ఎస్.ప్రోగ్రాం అధికారి టి.రాము తదితరులు పాల్గొన్నారు.

తుని: ఎన్ఎస్ఎస్ డే సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రోగులకు రొట్టెలు పంపిణీ చేశారు. మంగళవారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో తుని డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1 పీఓ ఢిల్లేశ్వరరావు, వలంటీర్లు బాలింతలు, రోగులకు రొట్టెలు అందజేశారు. ప్రిన్సిపల్ లలిత, గోవిందు, చిన్నారావు పాల్గొన్నారు.

గండేపల్లి: విద్యార్థులు ఎన్ఎస్ఎస్‌లో భాగస్వాములు కావాలని ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ఛాన్సలర్ ఎం. శ్రీనివాసరెడ్డి అన్నారు. సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో మంగళవారం జాతీయ సేవా విభాగం ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ. రమేష్, కె.రవిశంకర్, డి.సతీష్ కుమార్ పాల్గొన్నారు.

## ఏలేరు కాలువ గండ్లకు శాశ్వత పరిష్కారం



ముక్కొల్లులో ఏలేరు గట్టుకు గండి పడిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న పుల్లారావు

కిర్లంపూడి: ఇటీవల భారీ వరద నీటితో ఏలేరు కాలువ గట్టుకు పడిన గండ్లను పూడ్చేందుకు చర్యలు చేపడతామని రాష్ట్ర చీఫ్ ఇంజినీర్ పుల్లారావు అన్నారు. మండలంలోని ఎస్.తిమ్మాపురం, ముక్కొల్లు రెగ్యులేటర్లను, ఏలేరు కాలువ గట్టుకు గండ్లు పడిన ప్రదేశాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద నీటితో ఏలేరు కాలువ గట్టుకు సుమారు 250 గండ్లు పడ్డాయన్నారు. మరోసారి రైతుల పంటలకు నష్టం వాటిల్లకుండా ఏలేరు గట్టుకు పడిన గండ్లను శాశ్వతంగా పూడ్చే చర్యలు చేపతామన్నారు. ఆయన వెంట ఎస్ఈ శ్రీనివాసరావు, ఇన్‌చార్జి ఈఈ శేషగిరిరావు ఏఈ ఎస్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

### కనకదుర్గమ్మ గ్రామోత్సవం



గోకవరంలో స్వర్ణ కిరీటానికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దాత శ్రీనివాస్‌రావు

గోకవరం: స్థానిక దేవీచౌక్ ఆలయంలో కొలువై ఉన్న కనకదుర్గమ్మకు విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్‌రావు రూ.14 లక్షలు, భక్తులు రూ.7 లక్షలు కలిపి రూ.21 లక్షలతో చేయించిన నవరత్న ఖచ్చిత స్వర్ణకిరీటాన్ని మంగళవారం గోకవరంలో ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. తొలుత ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఊరేగించారు. బుధవారం పలు గ్రామాల్లో ఊరేగింపు నిర్వహిస్తామని దాత కంబాల శ్రీనివాస్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్ద దాసరి తమ్మన్నదొర, రామసేన సభ్యులు మామిడి అయ్యప్ప, తామర్ల రాంబాబు, ఇనకోటి బాపన్నదొర, డాక్టర్ వల్లూరి జగన్నాథశర్మ, వరసాల ప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.

## డివైడర్ దాటి దూసుకెళ్లిన ట్రావెల్స్ బస్సు

### ప్రయాణికులకు తప్పిన ప్రమాదం



బెండపూడి జాతీయ రహదారిపై ప్రమాదానికి గురైన ట్రావెల్స్ బస్సు

తొండంగి: మండలంలోని బెండపూడి జాతీయ రహదారిపై మంగళవారం ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు టైరు పంక్చర్ కావడంతో డివైడర్ దాటి రోడ్డు పక్కన ఉన్న పూరి గుడెసెలోకి దూసెకెళ్లింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బెండపూడి జాతీయ రహదారిపై హైస్కూలు ఎదురుగా విజయవాడ వైపు నుంచి విశాఖపట్నం వైపు వెళుతున్న ట్రావెల్స్ బస్సు టైరు పంక్చర్ కావడంతో అదుపుతప్పి డివైడర్ దాటి రాజమండ్రి వైపు రహదారిపై రోడ్డు పక్కన ఉన్న మామిడి కాయలు వ్యాపారులు వేసుకున్న గుడిసెలను ఢీకొంది. అదృష్టవశాత్తు బస్సుకు ఎదురుగా ఎటువంటి వాహనాలు రాకపోవడం, గుడిసెల్లో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. బస్సులో ప్రయాణికులకు ఎలాంటి ప్రాణాపాయం లేదు. ప్రమాదం తెల్లవారుజామున కావడంతో ఒక్కసారిగా ప్రమాదం జరిగి శబ్దం రావడంతో ప్రయాణికులు ఏమి జరుగుతుందో తెలియక భయాందోళనకు గురయ్యారు. కొద్ది మందికి ప్రాథమిక చికిత్స అందించి వేరే వాహనాల్లో పంపారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు ధర్మవరం విద్యార్థుల ఎంపిక



రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ప్రత్తిపాడు రూరల్: ధర్మవరం గ్రామంలోని అద్దేపల్లి అచ్యుతరామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికయ్యారని ఎంఈఓ వి.రాజబాబు తెలిపారు. అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాకినాడలో ఇటీవల జరిగిన ఎంపికలో పాఠశాల విద్యార్థులు యు.సూర్యచరణ్ (పెంటాథలాన్) బి.హేమ వరలక్ష్మి, సీహెచ్ యువనేశ్వరి (600 మీటర్ల పరుగు). వై.గంగామణి కంఠ (జావలిన్) జి.శిరీష (ట్రయాథలాన్) పోటీల్లో పాల్గొంటారని ఆయన వివరించారు. రాజమహేంద్రవరంలో అక్టోబరు 4, 5 తేదీల్లో రాష్ట్ర స్థాయి పోటీలు జరగుతుతాయని తెలిపారు. విద్యార్థులను ప్రధాన ఉపాధ్యాయుడు రామ్మూర్తి, ఉపాధ్యాయులు అభినందించారు.

### ముక్తార్ పాషాకు నివాళి

జగ్గంపేట: స్థానిక భగత్‌సింగ్ నగర్‌లో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర పెంకు కార్మికుల నేత స్వర్గీయ ముక్తార్ పాషా నాలుగో వర్ధంతి సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వచ్చిన సీపీఐఎంఎల్ న్యూడెమక్రసీ రాష్ట్ర కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు నివాళులు అర్పించి మాట్లాడారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.ఏసు, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయుకులు గుబ్బల ఆదినారాయణ, రాఘువులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## సామూహిక ఎలుకల నివారణతో అధిక దిగుబడి



డి.పోలవరంలో మాట్లాడుతున్న ఏడీఏ బుల్లిబాబు



ఎస్పార్‌పేటలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ



సిరిపురంలో మాట్లాడుతున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

**గ్రామాల్లో వ్యవసాయాధికారుల ఆధ్వర్యంలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమం**

తుని రూరల్: సామూహిక ఎలుకల నివారణతో అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయ సహాయ సంచాలకులు సుంకర బుల్లిబాబు అన్నారు. మంగళవారం తుని మండలం డి.పోలవరం, నందివంపు గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో జరిగింది. డి.పోలవరం కార్యక్రమంలో పాల్గొన్న ఏడీఏ బుల్లిబాబు మాట్లాడుతూ రైతులంతా సామూహికంగా ఎలుకలను నిర్మూలించాలన్నారు. అందుకు అవసరమైన మందును అందజేస్తున్నట్టు తెలిపారు. ఎర ఏవిధంగా తయారు చేయాలని, ఎలా వినియోగించాలో ఏరువాక శాస్త్రవేత్తలు డాక్టర్ శర్మ, డాక్టర్ రమేష్‌బాబు ప్రయోగాత్మకంగా చూపించి, రైతులకు అవగాహన కల్పించారు. ఎరువులు, పురుగు మందులు అధికంగా వాడి పెట్టుబడులు భారాన్ని పెంచుకోవద్దన్నారు. ఏఓ బి.అశోక్ కుమార్, ఏఈఓ పి.జగ్గఅప్పారావు, పలకా సోమేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం: వ్యవసాయ రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. సిరిపురం గ్రామంలో మంగళవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం సర్పంచ్ పీతల నూకరాజు అధ్యక్షతన జరిగింది. రైతులు సాగుపై అవగాహన కల్పించారు. అధికారులు, రైతులు పాల్గొన్నారు.

కోటనందూరు: మండలంలో ఎస్పార్‌పేట, బిళ్లనందూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి కేజే చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎలుకల వల్ల పంటకు వాటల్లే నష్టం, నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ఎలుకల నివారణ మందు తయారీని ప్రయోగాత్మకంగా వివరించారు.

రౌతులపూడి: రౌతులపూడిలో రైతు భరోసా కేంద్రం వద్ద మండల వ్యవసాయాధికారి రెడ్డి ఈశ్వరరావు ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. పంటల సాగు, తెగుళ్ల వాటి నివారణ చర్యలపై అవగాహన కల్పించారు.

ప్రత్తిపాడు: మండలంగ్రామాల్లోని రైతులకు మంగళవారం ఉచితంగా ఎలుకల నివారణ మందును పంపిణీ చేసినట్టు మండల వ్యవసాయాధికారి యింటి వీర గంగాధర్ తెలిపారు. ఆయా గ్రామాల్లోని సచివాలయం, రైతు సేవా కేంద్రాలల్లో బ్రోమోడియలన్ మందును అందజేశారు.

కిర్లంపూడి: రామకృష్ణపురంలో ఏఓ జోకా అమృత ఆధ్వర్యంలో మంగళవారం పొలంపిలుస్తోంది నిర్వహించారు. పెద్దాపురం ఏడీఏ ఎస్ దైవకుమార్ రైతులకు సామూహిక ఎలుకల నివారణపై ప్రయోగాత్మకంగా వివరించారు.

తొండంగి: మండంలోని గోపాలపట్నం, పి.ఇ.చిన్నాయపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయశాఖాధికారి ఎస్. నరసింహం పాల్గొని రైతులు పలు సూచనలు చేశారు.

గండేపల్లి: ఎలుకలు నిర్మూలించేందుకు వ్యవసాయాధికారి సద్గురుమూర్తి రైతులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. మండలంలోని యర్రంపాలెంలో మంగళవారం సామూహిక ఎలుకలు నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు.

జగ్గంపేట: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు వ్యవసాయ విస్తరణపై రైతులు అవగాహన పెంచుకోవాలని దీనివల్ల ఎంతో మేలు కలుగుతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు తెలిపారు. జగ్గంపేట మండలంలోని నరేంద్రపట్నం, మామిడాడ గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి రెడ్ల శ్రీరామ్ ఆధ్వర్యంలో వ్యవసాయ, అనుబంధ రంగాల సారథ్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పెద్దాపురం ప్రాంతీయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు, వ్యవసాయ, హార్టికల్చర్ అధికారులు రైతులకు వ్యవసాయంలో నూతన మెళకువలు, సాంకేతికతపై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.